# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 22-04-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- రబీ పంట ధాన్యాన్ని కనీస మద్దత్తు ధరకు రైతుల నుంచి కొనుగోలు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్ రెడ్డి అధికారులను ఆదేశించారు.
- అభ్యర్థుల ప్రచార వ్యయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ప్రత్యేక ఎన్నికల వ్యయ పరిశీలకులు నీనా నిగమ్ అధికారులకు సూచించారు.
- విద్యార్థులు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునేందుకు 'హాలిడే ఫన్ 2024' పేరుతో రాష్ట్ర విద్యా శాఖ కొత్త కార్యక్రమాన్ని ప్రారంభించింది.
- ద్రోణి ప్రభావంతో రాబోయే మూడురోజులు ఉత్తర, దక్షిణ కోస్తాలో తేలికపాటి జల్లులు పడే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది.

==================

రాష్ట్రంలో రబీ పంటకు సంబంధించిన ధాన్యాన్ని కనీస మద్దత్తు ధరకు రెండు మాసాల్లో రైతుల నుండి కొనుగోలు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్. జవహర్ రెడ్డి పౌర సరఫరాల శాఖ అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోలు, విత్తనాల సబ్సిడీపై ఈరోజు వెలగపూడి రాష్ట్ర సచివాలయంలో ఆయన వ్యవసాయ, పౌర సరఫరాల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రైతుల నుండి కనీస మద్దత్తు ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేయడంతో పాటు వారికి సకాలంలో సొమ్ము చెల్లించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే రాష్ట్రంలో విద్యుత్ సరఫరా పరిస్థితులపై నిర్వహించిన సమీక్షలో వేసవి ఎండల తీవ్రత దృష్ట్యా విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని, డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ సరఫరా చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

==================

ఎన్నికల ప్రచారంలో వ్యయ పరిమితికి మించి ఖర్చు చేసే అవకాశం ఉన్న అభ్యర్థులపై నిరంతర నిఘా ఉంచాలని రాష్ట్ర ప్రత్యేక ఎన్నికల వ్యయ పరిశీలకులు నీనా నిగమ్ అధికారులను ఆదేశించారు. ఈరోజు పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో నోడల్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, నామినేషన్లు ప్రారంభం అయిన దృష్ట్యా తనిఖీలు ముమ్మరం చేయాలని, సాధారణ పౌరులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అభ్యర్థులు చేస్తున్న ప్రచార ఖర్చులు, బహుమతుల పంపిణీ, ఇతర ఖర్చులపై దృష్టి సారించాలని తెలిపారు. బ్యాంకుల నుంచి జరిగే అనుమానాస్పద నగదు లావాదేవీలు, భారీ మొత్తంలో జరిగే లావాదేవిలు, నగదు డిపాజిట్లను పరిశీలించాలన్నారు. మద్యం అమ్మకాలు, రవాణాపై  నిరంతర నిఘా ఉంచాలని పేర్కొన్నారు.

==================

రాష్ట్రంలో అన్ని పాఠశాలలకు ఈ నెల 24 నుంచి వేసవి సెలవులు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ విద్యార్థులు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునేందుకు 'హాలిడే ఫన్ 2024' పేరుతో కొత్త కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ మేరకు పాఠశాలలకు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ కార్యక్రమం కింద, విద్యార్థులకు కోచింగ్ క్యాంపులు నిర్వహించడానికి పిఒఇలను కేటాయించారు. ఉపాధ్యాయులు విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంచాలన్నారు. 'వి లవ్ రీడింగ్' పేరుతో పోటీ నిర్వహించాలని ప్రధానోపాధ్యాయులు సూచించారు. ఈ మేరకు ఇటీవల నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో ప్రతి తరగతిలో అమలు చేయాల్సిన అంశాలకు సంబంధించి మార్గదర్శకాలను విడుదల చేస్తూ... సెలవుల్లో క్రీడలు, వృత్తి నైపుణ్యం, సృజనాత్మక కళలు, విద్యార్థులలో దాగిన సామర్థ్యాలపై దృష్టి పెట్టాలని విద్యాశాఖాధికారి సురేశ్‌కుమార్ వెల్లడించారు.

==================

కోస్తా, రాయలసీమ మీదగా చత్తీస్ గడ్ నుంచి దక్షిణ తమిళనాడు వరకు సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ద్రోణి విస్తరించింది. దీని ప్రభావంతో రాబోయే మూడురోజులు ఉత్తర కోస్తాల్లో తేలికపాటి వర్షాలు, దక్షిణ కోస్తాలో తేలికపాటి జల్లులు పడే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది. అలాగే గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ అధికారి వివరిస్తూ....

(వాయిస్ 18 సెకన్లు)

==================

జాతీయ అర్హత పరీక్ష (యూజీసీ నెట్) జూన్ 2024కు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నోటిఫికేషన్ విడుదల చేసింది. 83 సబ్జెక్టుల్లో జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ లో  అసిస్టెంట్ ప్రొఫెసర్, పీహెచ్‌డీలో ప్రవేశానికి అర్హత పరీక్షకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. మే 10వ తేదీలోగా ugcnet.nta.ac.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని, 12వ తేదీలోగా పరీక్ష రుసుము చెల్లించాలని సూచించింది. యూజీసీ గుర్తించిన విశ్వవిద్యాలయం నుంచి జనరల్ విద్యార్థులు పీజీలో 55 శాతం, ఇతరులు 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన వారు ఈ పరీక్షకు అర్హులుగా పేర్కొంది.

==================

ఆంధ్రప్రదేశ్‌లో పదోతరగతి ఫలితాలు ఈరోజు విడుదలయ్యాయి. విజయవాడలో పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్ కుమార్ 2023-24 టెన్త్ ఫలితాలను విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా రెగ్యులర్ విద్యార్థులు 6 లక్షల 16 వేల 617 మందిలో 5 లక్షల 34 వేల 574 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని ఆయన తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా బాలురు 84.32 శాతం, బాలికలు 89.17 శాతం ఉత్తీర్ణత సాధించారని వెల్లడించారు.

విరామం

==================

విశాఖ రేంజ్ డిఐజీ విశాల్ గున్ని ఎదుట ఆరుగురు మావోయిస్టులు స్వచ్ఛందంగా లొంగిపోయారు. వీరిలో డివిజనల్ కమిటీ సభ్యుడు కుహరం మిదిలేష్ అలియాస్ రాజుతో పాటు అయిదుగురు ఏరియా కమిటీ సభ్యులు బరిసే మోసా, పెట్టి భీమా, వంజం రామే, మడకం సుక్కి, దూడి సోనిలు వున్నట్లు డిఐజీ ఈరోజు జరిగిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. లొంగిపోయిన వారంతా దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యులుగా పేర్కొన్నారు. స్థానికంగా ప్రజల నుంచి మద్దతు లేకపోవడంతో వీరు లొగిపోయినట్లు తెలియజేశారు.

==================

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు సంభందించి అభ్యర్థుల మరో జాబితాను కాంగ్రెస్ పార్టీ ఈరోజు వెల్లడించింది. గతంలో 114 స్థానాలకు వెల్లడించగా.. తాజాగా 38 నియోజకవర్గాలకు ఖరారు చేసింది. ఇప్పటికే ప్రకటించిన 10 స్థానాల్లో అభ్యర్థులను మార్పు చేశారు. ఈ మేరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఓ ప్రకటన విడుదల చేశారు. దీంతో ఇప్పటి వరకు 142 స్థానాలకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ప్రకటించింది. ఇండియా కూటమి పొత్తులో భాగంగా అరకు లోక్‌సభతో పాటు 8 అసెంబ్లీ సీట్లను సీపీఎంకు కేటాయించారు. రాష్ట్రంలోని 25 లోక్‌సభ స్థానాల్లో ఇప్పటి వరకు 20 చోట్ల అభ్యర్థులను కాంగ్రెస్ ప్రకటించింది. పొత్తులో ఒకటి సీపీఎంకు కేటాయించగా మరో నాలుగు ఎంపీ, మిగిలిన అసెంబ్లీ స్థానాలకు ఖరారు చేయాల్సి ఉంది. అసెంబ్లీ అభ్యర్థుల జాబితాలో శ్రీకాకుళంకి - అంబటి కృష్ణారావు, బొబ్బిలి- మరిపి విద్యాసాగర్, గజపతినగరం - దోలా శ్రీనివాస్, నెల్లిమర్ల - ఎస్.రమేశ్‌కుమార్, విశాఖపట్నం ఉత్తరం - లక్కరాజు రామారావు, చోడవరం - జగత్ శ్రీనివాస్, యలమంచిలి - టి.నర్సింగ్ రావులకు కేటాయించింది.

==================

పదవ తరగతి ఫలితాలలో పార్వతీపురం మన్యం జిల్లా రాష్ట్రంలో వరుసగా రెండో సారి ప్రథమ స్థానంలో నిలవడం పట్ల జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆనందం వ్యక్తం చేశారు. ఈరోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, జిల్లా ప్రథమ స్థానంలో నిలవడం తనకు సంతృప్తిని ఇచ్చిందన్నారు. అందరి సమష్టి కృషితోనే ఇది సాధ్యమయ్యిందని, ఇందులో భాగస్వామ్యులైన విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధికారులు అందరికీ ఈ విజయం అంకితమన్నారు. ఇదే స్ఫూర్తి భవిష్యత్తులోనూ కొనసాగి జిల్లా ఆదర్శంగా నిలవాలని ఆకాక్షించారు.

==================

నామినేషన్ పత్రాలను సమర్పించే సమయంలో విధుల్లో ఉన్న ప్రభుత్వ సిబ్బందికి ఆటంకం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని చిత్తూరు జిల్లా కలెక్టర్ ఎస్.షన్మోహన్ హెచ్చరించారు. ఈరోజు కలెక్టరేట్ లో పాత్రికేయులతో మాట్లాడుతూ, గత నాలుగు రోజుల నుంచి నామినేషన్ల దాఖలు సమయంలో పలువురు రాజకీయ పార్టీల నేతలు విధులను నిర్వర్తిస్తున్న ప్రభుత్వ సిబ్బందిని ఇబ్బందులకు గురిచేస్తున్న విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. నామినేషన్ల దాఖలు సమయంలో నలుగురికి మాత్రమే అనుమతి ఉంటుందని, గుంపులుగా వస్తే అనుమతించేది లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వ సిబ్బందితో నేతలు వాగ్వాదానికి దిగినట్లయితే చర్యలు తీసుకుంటామన్నారు.

==================

దేశంలోని వివిధ ప్రాంతాలలో ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐ.పి.యల్) ఫ్యాన్ పార్క్ లను భారత క్రికెట్ కంట్రోల్ బోర్డ్ (బీసీసీఐ) ఏర్పాటు చేసింది. దీనిలో భాగంగా రాష్ట్రంలో గుంటూరు, తిరుపతిలలో ఈ ఫ్యాన్ పార్క్ లను ఏర్పాటు చేశారు. గుంటూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ రమణమూర్తి ఆకాశవాణితో మాట్లాడుతూ, భారీ ఎల్.ఇ.డి లు, వివిధ రకాల ఫుడ్ పాయింట్లతో ఈ ఫ్యాన్ పార్క్ లు లను ఏర్పాటు చేశామని, వీటికి ప్రజల నుండి మంచి ఆదరణ లభిస్తోందని వివరించారు.

==================

వ్యాధులు ప్రబలకుండా ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని పార్వతీపురం మన్యం జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి. జగన్మోహనరావు అధికారులకు సూచించారు. పార్వతీపురం మండలం బాలగుడబ గ్రామంలో వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది చేపట్టిన నివారణ కార్యక్రమాలను ఆయన పర్యవేక్షించారు. అనంతరం దోమల ద్వారా వ్యాప్తి చెందే మలేరియా, డెంగీ తదితర జ్వరాలు ప్రబలకుండా ఉండాలంటే ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు.

==================

==================